RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:58 | ఫిబ్రవరి 06, 2026 | వెల: రూ.3-00



కేసీఆర్ మేడారం దర్శనంపై

## సీఎం వ్యాఖ్యలు అబద్ధం

- సీతక్కే ప్రత్యక్ష సాక్షి
- హోదాకు తగ్గట్టుగా మాట్లాడాలని నేతల హితవు

2లో



## పేదలకు కనీసం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు

- ప్రజా ప్రభుత్వం ఏర్పడితే విషం చిమ్ముతున్నారు
- రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్

### బీజేపీ-బీఆరెస్‌ది ఫెవికాల్ బంధం

- కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏది?
- ఫార్ములా ఈ రేసు కేసులో ఏ స్పందనా లేదు
- ఏ మొహం పెట్టుకుని ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి వస్తున్నారు
- రెండేళ్ల పాలనలో ఎన్నో విజయాలు సాధించాం
- రైతులు, మహిళల కోసం భారీగా ఖర్చు చేశాం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

2లో

### బీఆర్ఎస్, బీజేపీపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

- చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో బహిరంగ సభ

# పదేళ్ల పాలనలో వేల కోట్లు పోగేశారు

వేద న్యూస్, చొప్పదండి

రాజన్న సిరిసిల్ల పర్యటనలో భాగంగా గుమ్లాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై నిప్పులు చెరిగారు. పదేళ్ల కాలంలో రాష్ట్ర సంపదను దోచుకున్న బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేసిన సీఎం, బీజేపీ–బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు దక్కడం బీఆర్ఎస్ చేసిన అవయవదానం కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో బీజేపీ జాతీయ నేతల రాకను సీఎం తప్పుబట్టారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, కాళేశ్వరం విచారణ, మెట్రో నిధులపై నోరు మెదపని బీజేపీ నేతలు.. ఏ మొహం పెట్టుకొని ప్రచారానికి వస్తున్నారని నిలదీశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కేడర్‌కు దిశానిర్దేశం చేశారు.



## అడ్డగోలు హామీల అమలెక్కడ?

### ప్రజలను మోసం చేయడానికే మాయ మాటలు

- ఎన్ని పంట కాలాలు పోయినా రైతుబంధు పడలే
- ఎన్నికలయ్యాక మళ్లీ మోసం చేస్తారు
- జిల్లాలు రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారు
- కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయాలి

2లో

### సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్



## విలువల పరిరక్షణే లక్ష్యం

- ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండా
- 7, 8 తేదీల్లో ప్రచారంలో పాల్గొంటాను
- తెలంగాణ జనసేన నాయకులతో పవన్ కళ్యాణ్
- సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగాలని సూచన

2లో


## వారికి ఓటు అడిగే హక్కు లేదు



- కేంద్ర నిధులతో కోట్ల రూపాయల అభివృద్ధి
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు

2లో

# పగలు.. ప్రతీకారాలు..!




### విద్వేషాలతో రగులుతున్న కమలాపూర్

#### భూ దందాలు, అక్రమ వసూళ్లకు అడ్డా

- అసాంఘిక కార్యకలాపాల్లో యువత నిమగ్నం
- విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి వినియోగం
- కుటుంబాల్లో చిచ్చు రేపుతున్న స్వార్థపరులు
- అక్రమ కేసులు, దౌర్జన్యాలు ఇక్కడ కామన్
- గొడవలు పెట్టి రాక్షసానందం పొందుతున్న 'పెద్ద మనుషులు'
- పతనమవుతున్న ఊరి ప్రతిష్ట
- మార్పు రావాలంటున్న మేధావులు, గ్రామస్తులు


2లో

వేద న్యూస్, కమలాపూర్

ఒకప్పుడు ఆప్యాయతలకు, అన్నదమ్ముల అనుబంధాలకు నిలయమైన కమలాపూర్ మండలం నేడు కక్షలు, కుతంత్రాల కుంపటిగా మారుతోంది. ప్రశాంతంగా సాగిపోవాల్సిన పల్లెల్లో పగ ప్రతీకారాలు భగ్గుమంటున్నాయి. కొందరు స్వార్థపరుల నీచమైన ఆలోచనలు, భూదందాలు, మాదక ద్రవ్యాల విచ్చలవిడి వాడకం వల్ల గ్రామీణ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. విలువల కన్నా డబ్బుకే ప్రాధాన్యత పెరిగిపోవడంతో, గజం భూమి కోసం సొంత రక్త సంబంధీకులనే శత్రువులుగా మార్చుకుంటున్న దారుణ పరిస్థితులు ఇక్కడ రాజ్యమేలుతున్నాయి. అమాయకుల మధ్య చిచ్చుపెట్టి, పంచాయితీల పేరుతో పబ్బం గడుపుకునే దళారులు, వారి వెనుక ఉన్న అదృశ్య రాజకీయ శక్తులు కమలాపూర్‌ను వినాశనం వైపు నడిపిస్తున్నాయి. చదువుకున్న యువత, మేధావులు మౌనం వీడితేనే ఈ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

# పగలు.. ప్రతీకారాలు..!

## విద్వేషాలతో రగులుతున్న కమలాపూర్




**వేద న్యూస్, కమలాపూర్**

ఒకప్పుడు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉన్న ప్రజల మధ్య నేడు పగ ప్రతీకారాలు భగ్గుమంటున్నాయి. నిత్యం విద్వేషాలతో విచ్ఛిన్నమవుతూ, కుట్రలు కుతంత్రాలు రాజ్యమేలుతున్నాయి. ఒకరికొకరు సహ కరించుకోవాల్సింది పోయి, పక్కా ప్రణాళికతో ఒకరి నొకరు నాశనం చేసుకునే స్థాయికి వివాదాలు చేరుతు న్నాయి. కొందరు స్వార్థపరుల దుశ్చర్యల వల్ల ఊరి విలువలు దిగజారుతున్నాయి. కక్షలు, కార్పణ్యాలతో అట్టుడుకుతున్న హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండలం గురించి 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం...

- భూ దందాలు, అక్రమ వసూళ్లకు అడ్డా
- అసాంఘిక కార్యకలాపాల్లో యువత నిమగ్నం
- విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి వినియోగం
- కుటుంబాల్లో చిచ్చు రేపుతున్న స్వార్థపరులు
- అక్రమ కేసులు, దౌర్జన్యాలు ఇక్కడ కామన్
- గొడవలు పెట్టి రాక్షసానందం పొందుతున్న 'పెద్ద మనుషులు'
- పతనమవుతున్న ఊరి ప్రతిష్ట
- మార్పు రావాలంటున్న మేధావులు, గ్రామస్తులు

### అసాంఘిక కార్యకలాపాలు.. భూ దందాలు

కమలాపూర్‌లో డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం విచ్చలవిడిగా సాగు తోందన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. ఈ అసాంఘిక కార్యకలాపాలకు తోడు భూ దందాలు, అక్రమ వసూళ్లు, బ్లాక్‌మెయిలింగ్‌తో కొందరు అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నారు. కొన్ని సంఘ విద్రోహ శక్తులు కావాలనే కుట్రలు పన్నుతూ గ్రామంలో కల్లోలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి.

### కుటుంబాల్లో చిచ్చు..

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి భూతగాదా లను ఆసరాగా చేసుకుని పంచాయితీలు చేసే వ్యక్తులు తయారయ్యారు. అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టి, వారిని రెచ్చగొట్టి కోర్టులు, కేసుల చుట్టూ తిరిగేలా చేస్తున్నారు. మహిళలను సైతం ఈ వివాదాల్లోకి లాగి దూషణలకు దిగేలా ప్రోత్సహిస్తూ, రెండు కుటుంబాలు సర్వనాశనం అవుతుంటే కొందరు స్వార్థపరులు రాక్ష సానందం పొందుతున్నారు. నిజాయితీగా సమస్యలు తీర్చే పెద్దమనుషులు ఉన్నప్పటికీ, అన్యాయం వైపు నిలబడే శక్తుల వల్ల అమాయకులు బలైపోతున్నారు.

### అమాయకులపై అక్రమ కేసులు

కొందరు రాజకీయ నాయకులు తమ అండదండలతో పోలీసు అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. అమాయకులపై అక్రమ కేసులు బనాయించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి సాగుతున్నాయి. మనసుల్లో విషం నింపుకున్న కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఊరి వినాశనానికి ప్లాన్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మారిన విలువలు..

గతంలో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జీవించేవారు. ఏవైనా సమస్యలు వస్తే కూర్చుని మాట్లాడుకుని రాజీ పడేవారు. కానీ నేడు గజం భూమి కోసం లక్షలు ఖర్చు చేసి, సొంత రక్తసంబంధీకులను శాశ్వత శత్రువులుగా మార్చుకుంటున్నారు. నేటి కాలంలో పంచాయి తీలు పక్కా కమర్షియల్ అయిపోయాయి. ఎవరి దగ్గర డబ్బులు ఉంటే వారికే న్యాయం అన్న చందంగా పరిస్థితులు మారాయని, మధ్యలో దళారులు లాభపడుతుంటే కుటుంబాలు వీధిన పడుతున్నాయని మేధావులు ఆవేదన చెందుతున్నారు. ఈ దారుణ పరిస్థితులను అరికట్టేందుకు చదువు కున్న యువత, ఉద్యోగులు, మేధావులు, నిజాయితీ గల రాజకీయ నాయకులు ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం నింపాలి. కమలాపూర్ మళ్లీ అన్నపూర్ణలా మారి, ప్రశాం తమైన వాతావరణంలో విలసిల్లాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

---

కేసీఆర్ సమ్మక్క-సారలమ్మ దర్శనంపై

## సీఎం వ్యాఖ్యలు అబద్ధం

- సీతక్కే ప్రత్యక్ష సాక్షి
- హోదాకు తగ్గట్టుగా మాట్లాడాలని నేతల హితవు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ముఖ్యమంత్రి హోదాలో ఉండి బాధ్యతలేని వ్యాఖ్యలు చేయడం సరికాదని, రేవంత్ రెడ్డి పై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ సమ్మక్క, సారలమ్మ లను దర్శించుకోలేదన్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని నేతలు ఖండించారు. కేసీఆర్ కుటుంబ సమేతంగా సమ్మక్క, సారలమ్మ జాతరకు హాజరై, తులాభారంలో బంగారం సమర్పించినట్లు స్పష్టమైన ఆధారాలు, ఫొటోలు ఉన్నాయని తెలిపారు. ఆ దర్శన సమయంలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా కేసీఆర్ వెంట ఉన్నారని, ఆమెనే ప్రత్యక్ష సాక్షి అని పేర్కొన్నారు. ఇలాంటి స్పష్టమైన వాస్తవాలు ఉన్నప్పటికీ అబద్ధాలు ప్రచారం చేయడం తగదని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాటలకు బాధ్యత ఉండాలని ప్రజలు హితవు పలుకుతున్నారు. నిజాలను వక్రీకరించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు వ్యక్తమవు తున్నాయి.

---

## వారికి ఓటు అడిగే హక్కు లేదు

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**వేద న్యూస్, హుజూరాబాద్**

హుజూరాబాద్ మున్సిపాలిటీకి రూపాయి కూడా ఇవ్వని బీఆర్ఎస్‌కు, అభివృద్ధిలో విఫలమైన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజూరాబాద్ పట్టణంలో పర్యటించిన బండి సంజయ్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తెచ్చి హుజూరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డామని చెప్పారు. 14, 15వ ఆర్థిక సంఘాలు, స్వచ్ఛ భారత్, అమృత్, స్వనిధి పథకాల ద్వారా కోట్ల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. వీధిదీ పాలు, డ్రైనేజీలు, రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరిగిందన్నారు. బీజేపీకి మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కితే అర్ధాంతరంగా నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్ పనులు పూర్తి చేస్తామని, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

---

ప్రజలను మోసం చేయడానికే

## మాయ మాటలు

- ఎన్ని పంట కాలాలు పోయినా రైతుబంధు పడలే
- అడ్డగోలు హామీల అమలు ఎక్కడ?
- జిల్లాలు రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారు.
- కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయాలి
- సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్



**వేద న్యూస్, సిరిసిల్ల**

మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుబంధు వేస్తామని సీఎం చెబు తున్నారని, ఇప్పటివరకు ఎన్ని పంటకాలాలు గడిచాయో, రైతుల ఖాతాల్లో ఎన్నిసార్లు రైతుబంధు జమ చేశారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు రైతుబంధు చెల్లింపులకు ఎలా అడ్డంకిగా మారాయో ప్రజలు ఆలో చించాలని సూచించారు. సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆశలు చూపించి, ఎన్నికలు పూర్తయ్యాక మళ్లీ ప్రజలను మోసం చేయడానికే కాంగ్రెస్ ఈ మాటలు చెబుతోందని ఆరోపించారు. అధి కారంలోకి రాకముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ వంటి పథ కాలను కూడా పక్కన పెట్టారని, అడ్డగోలు హామీలతో అధికారం లోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్య మంత్రిగా అధికారమూ, అవకాశం ఉన్నప్పటికీ గత ముఖ్యమంత్రి కేసీఆర్ను విమర్శించాల్సిన అవసరం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. చేతనైతే ప్రజలకు మంచి చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. అయితే గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా చేయలేదని, అబద్ధాలు చెప్పడం తప్ప ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకో లేదని విమర్శించారు.

### జిల్లాలను రద్దు చేసే కుట్ర

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను రద్దు చేయడానికి కుట్ర పన్నుతోం దని కేటీఆర్ ఆరోపించారు. జిల్లా కేంద్రాలను ఎత్తివేస్తామని చెప్పిన పార్టీకి ఓటు వేయాలా? వద్దా? అన్న విషయాన్ని ప్రజలు ఆలోచిం చాలని పిలుపునిచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల పోటీ గత పదేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలు అమలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి, రెండేళ్లలోనే ఉన్న పథకా లను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరుగుతోందని అన్నారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమం త్రిగా చేస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు తిరిగి ప్రారంభమవుతా యని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికల నుంచే ఉద్యమం మొదలు పెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

---

## పదేళ్ల పాలనలో వేల కోట్లు పోగేశారు

**వేద న్యూస్, చొప్పదండి**



- పేదలకు కనీసం డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వలేదు
- బీజేపీ-బీఆరెస్‌ది ఫెవికాల్ బంధం
- ఏ మొహం పెట్టుకుని ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి వస్తున్నారు
- బీఆర్ఎస్, బీజేపీపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ ఇచ్చిన మాటను ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలబెట్టుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పదేళ్ల పాటు అధికారం అనుభవించిన బీఆరెస్ నాయకులు వేల కోట్ల రూపాయలు సంపాదిం చుకున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో జరిగిన బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో పేదలకు కనీసం డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తు న్నామని తెలిపారు.

### ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్

రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని స్పష్టం చేసిన సీఎం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

### బీజేపీపై ప్రశ్నల వర్షం

నిన్న ఢిల్లీ నుంచి వచ్చిన పెద్ద నాయకుడు పాల మూరుకు వచ్చారని, మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీజేపీని గెలవనీయమని కాంగ్రెస్ కార్యకర్తలు నిర్ణయించుకున్నారని సీఎం అన్నారు. గతంలో పాలమూరుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ పాలమూరు-రంగారె డ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామన్నారని, రాష్ట్రానికి వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. మెట్రో రైలు రెండో విడత, కాళేశ్వరం విచారణ, మూసీ ప్రక్షాళన నిధుల గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఏం మొహం పెట్టుకుని బీజేపీ జాతీయ నాయకులు రాష్ట్రానికి ప్రచారానికి వస్తున్నారని ప్రశ్నించారు.

### బీజేపీ-బీఆరెస్ ది ఫెవికాల్ బంధం

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆరెస్ అవయవదానం చేసి బీజేపీని 8 స్థానాల్లో గెలిపించిందని ఆరో పించారు. అసెంబ్లీ సాక్షిగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేయాలని కేంద్రానికి పంపిన తీర్మానంపై ఆరు నెలలు గడిచినా ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందన్న ప్రధాని వ్యాఖ్యల తర్వాత కూడా ఎందుకు సీబీఐ విచారణ జరగలేదని నిలదీశారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఐఏఎస్ అధికారిపై విచారణకు అనుమతి కోరుతూ లేఖ రాసినా స్పందన లేదని తెలిపారు.

### రెండేళ్ల పాలనలో ఎన్నో విజయాలు

రెండేళ్లలో ఏం చేశారంటూ ప్రశ్నిస్తున్న బీజేపీ, బీఆరెస్ నేతలు ముందు పదేళ్లలో బీఆరెస్, పన్నెండేళ్లలో మోదీ చేసిన పనులు చెప్పాలని సీఎం అన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ చేసిన పనులు చెబితే గుండెలు పగులుతాయని వ్యాఖ్యానించారు. నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 100 నియోజకవ ర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు.

### రైతులు, మహిళల కోసం భారీ వ్యయం

25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతు భరోసా అందించామని తెలిపారు. రెండేళ్లలో రైతుల కోసమే లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశామని పేర్కొన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తు న్నామని తెలిపారు. వరి వేస్తే ఉరి అన్న వాళ్లకు భిన్నంగా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, వ్యవసా యాన్ని పండుగలా చేస్తున్నామని సీఎం అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లలో రూ.9 వేల కోట్లు ఖర్చు చేశామని, రూ.27 వేల కోట్ల రుణాలు అందించి మహిళలను వ్యాపారవేత్త లుగా మార్చామని తెలిపారు. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సుల యజమానులుగా చేశామని పేర్కొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

ఢిల్లీ నుంచి కరీంనగర్ అభివృద్ధికి బీజేపీ నేతలు తెచ్చిన నిధులు ఏంటో బండి సంజయ్ చెప్పాలని సీఎం సవాల్ విసిరారు. ఎవరు ఏం ఇచ్చినా ఇవ్వకపోయినా తెలంగాణ అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వారిని ఎన్నుకోవాలని, కరీంనగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

---

## ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

### తెలంగాణ జనసేన నాయకులతో పవన్ కళ్యాణ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని, మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తన రాజకీయ బాధ్యతను స్పష్టంగా నిర్వర్తిస్తుందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పవన్ తెలంగాణ జనసేన నాయకులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహం, ప్రచార కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయా లని, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రచారం నిర్వహించాలని, అభివృద్ధి, పారదర్శక పాలన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ నెల 7, 8 తేదీల్లో జనసేన పార్టీ అభ్యర్థులకు, అలాగే బీజేపీ పార్టీకి మద్దతుగా తాను స్వయంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని ప్రకటించారు. పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో, ఐక్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన అభిప్రాయప డ్డారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇన్‌చార్జి శంకర్ గౌడ్, రాజలింగం, ఆర్కే సాగర్‌తో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

---



ఓ వైపు సీఎం బహిరంగ సభ..

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

**వేద న్యూస్ చొప్పదండి**

సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో గుమలాపూర్ గ్రామానికి చెందిన గడుగు రాజేశం ను సొంత పార్టీ వాళ్లు అరెస్టు చేయించడంతో విసిగి చెందిన అతను కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తిని సంపత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో లోక రాజేశ్వర్ రెడ్డి, టిఆర్ఎస్వి పట్టణ అధ్యక్షులు నరేష్ రావణ్, బిసవేని రాజశేఖర్ లు పాల్గొన్నారు.

# 5వ వార్డులో ఇంటింటి ప్రచారం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అభ్యర్థి భుక్య స్రవంతి -నరేష్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ దుబ్బెట తండా, సవట్ తండాలలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా వాసులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఎమ్మెల్యే నాగరాజుకి ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఖమ్మం హైవే నుంచి గుబ్బెట్ట రూ.3 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే రూ.2 కోట్ల నిధులతో బంజారా భవన్ మంజూరు చేయించామని అన్నారు. వడ్ల కొనుగోలులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే కొత్త ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తండాలను అక్రమంగా మున్సిపాలిటీలో చేర్చిందని, ప్రజల ఆకాంక్ష మేరకు త్వరలోనే తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సన్నబియ్యం పంపిణీ, జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి ఇప్పటివరకు రూ.34 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. వర్ధన్నపేట పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో 100 పడకల ఆసుపత్రికి ఇటీవలే శంకుస్థాపన చేశామని, దీని ద్వారా తండాలు, గూడాలు, చుట్టుపక్కల ప్రాంతాలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఇటీవలే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సుమారు రూ.294 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీ స్టేడియం, సబ్ జైలు, మున్సిఫ్ కోర్టు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులలో అవుట్‌సోర్సింగ్ ఉంటే వచ్చే ఉద్యోగాల్లో స్థానికులకే తొలి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత జరుగుతున్న అభివృద్ధి ఏమిటో ప్రజలు గమనించాలని, 5వ వార్డు అభ్యర్థి భుక్య స్రవంతి-నరేష్ కి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గిరిజన సోదర సోదరీమణులను ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వర్ధన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ, ఇంచార్జ్ జాతోతు శ్రీనివాస్ నాయక్, స్థానిక నాయకులు మోహిబుబ్, రమేష్, మంగ్య ,తారాభాయ్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనంతో మమేకమవుతూ..

- అందరినీ ఆత్మీయంగా కలుస్తూ..
- 30 వ వార్డులో రవీందర్ రావు విస్తృత ప్రచారం

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రామడుగు రవీందర్ రావు ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేస్తున్నారు. జనంతో మమేకమవుతూ అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ.. ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తమను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరుతున్నారు. 30 వ వార్డు ప్రజల సంక్షేమం , అభివృద్ధి యే ధ్యేయంగా తాను ముందుకు సాగుతానని స్పష్టం చేస్తున్నారు. తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే తాను చిత్తశుద్ధితో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

**సంక్షేమమే లక్ష్యం**

30 వ వార్డు ప్రజల సంక్షేమ మే లక్ష్యంగా తాను కౌన్సిలర్ బరిలో నిలిచానని రామడుగు రవీందర్ రావు వెల్లడించారు. జనం కోసం 24/7 అందుబాటులో ఉంటానని, వారికి పిలుపు దూరంలోనే ఉంటూ.. సేవనే పరమావధిగా భావించే తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరుతూ రవీందర్ రావు తరఫు న బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు బలంగా విస్తృతంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. 30వ వార్డు లో గులాబీ జెండా రెపరెపలాడట మే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బలంగా పనిచేస్తున్నారు. ప్రతి ఇంటికీ చేరువై.. అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ.. సేవే పరమావధిగా ముందుకు వస్తున్న తమను ఆదరించి ఆశీర్వదించాలని ప్రజలను వినమ్రంగా రవీందర్ రావు కోరుతున్నారు.

# కొత్తపల్లి ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి లో ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆటో డ్రైవర్లు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడి గా పసర కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కాలేష శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి గా లడే రామా రావు, క్యాషియర్ గా దరుగుల కుమార్ , కార్యదర్శిగా లడే జానకి రామ్ ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పనిచేస్తుందని కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, మడిపల్లి, శ్రీరాములపల్లి, కనగర్తి, గుండేడు గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# దేవాదుల నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్,నల్లబెల్లి :**



దేవాదుల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లబెల్లి మండలంలోని చెరువులను నింపేందుకు మూడు చెక్కలపల్లి లింక్ మెయిన్ కెనాల్ ద్వారా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రబీ సీజన్ పంటల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు మొత్తం 5 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కుమారస్వామి, ఎస్ఈ స్వామి,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్,ఈఈలు నారాయణ,సుదర్శన్,డీఈ యశ్వంత్,ఏఈలు పాల్గొన్నారు.

# చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఈస్ట్ జోన్ డిసిపి

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



పరకాల మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకొని పరకాల పట్టణ మున్సిపల్ సరిహద్దుల్లో నాలుగు స్టాటిక్ సర్వ లైన్స్ టీంలతో ఏర్పాటు చేసిన హన్మకొండ, హుజురాబాద్,చలివాగు బ్రిడ్జ్ వెల్లంపల్లి మార్గాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తీరుపై డీసీపీ చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రాల్లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. డీసీపీ వెంట పరకాల ఏసీపీ సతీష్ బాబు, ఇన్స్ స్పెక్టర్ క్రాంతి కుమారు పాల్గొన్నారు.

# జెఎన్ టియు ఎచ్ లో పద్నాలుగవ స్నాతకోత్సవం

**వేద న్యూస్, కూకట్ పల్లి :**




జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో హైదరాబాద్ పద్నాలుగవ స్నాతకోత్సవం ఈనెల 7న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ విసి కిషన్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. పత్రికా సమావేశంలో విసి మాట్లాడుతూ స్నాతకోత్సవం అనంతరం విశ్వవిద్యాలయం సాధించిన ముఖ్యమైన అకడమిక్, పరిపాలనా, పరిశోధనా మరియు అభివృద్ధి సంబంధిత మైలురాళ్లను ఈ సందర్భంగా ఆయన ప్రకటిస్తామన్నారు. మొత్తం 82,547 మంది విద్యార్థులకు యూజీ, పీజీ మరియు పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయబడతాయి. వీటిలో 87 డాక్టరల్ డిగ్రీలు ఉన్నాయి. ఈ సంవత్సరానికి విశ్వవిద్యాలయం 71 గోల్డ్ మెడల్స్‌ను ప్రవేశపెట్టినట్టు విసీ తెలిపారు. పరిపాలనను మరింత సమర్థవంతంగా, శ్రద్ధతో నడిపించేందుకు ముఖ్యమైన నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామన్నారు.

# రైతులకు తలనొప్పిగా యూరియా యాప్

- పట్టా పాస్‌బుక్ లేని రైతులకు తక్షణమే యూరియా అందజేయాలి
- ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్



**వేద న్యూస్ , ఎల్కతుర్తి:**

పట్టా పాస్‌బుక్ లేని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే యూరియా కొరతతో అల్లాడుతున్న రైతులకు యూరియా యాప్ మరో తలనొప్పిగా మారిందని ఎల్కతుర్తి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టా పుస్తకాలు లేకుండా వ్యవసాయం చేస్తున్న రైతులను దృష్టిలో పెట్టుకోకుండా యూరియా పంపిణీలో నిబంధనలు విధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాప్‌లో నమోదు సమస్యలు సాంకేతిక లోపాల కారణంగా రైతులు గంటల తరబడి సహకార కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పట్టా ఉన్నా లేకపోయినా పంటలు పండించే ప్రతి రైతుకూ.. ఎలాంటి అడ్డంకులు నిబంధనలు లేకుండా సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు నమోదు చేసి పాస్‌బుక్ లేని రైతులకూ యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు పంట వేసే సమయంలో ఎరువులు దొరకకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

# స్తంభాన్ని మరిచారు.. రోడ్డు వేస్తున్నారు !

- అధికారుల సమన్వయ లోపం
- స్తంభం తొలగించకుండానే బీటీ రోడ్డు నిర్మాణం

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధిలో భాగంగా కోరుట్ల బస్టాండ్ కమాన్ నుంచి చెక్కపల్లి బస్టాండ్ వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల్లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలోనే కోరుట్ల బస్టాండ్ కమాన్ వద్ద విద్యుత్ శాఖ అధికారులు నూతన కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో తొలగించాల్సిన పాత స్తంభాన్ని అధికారులు అలాగే వదిలేశారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో రోడ్డు పనులు కొనసాగుతున్నప్పటికీ, ఆ పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటేడ పాత స్తంభం చుట్టూరానే రోడ్డు నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. ఒకసారి రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక ఆ స్తంభాన్ని తొలగించాలంటే మళ్లీ రోడ్డును తవ్వాల్సి వస్తుందని, ఇది ప్రజాధనాన్ని వృథా చేయడమేనని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాకుండా రోడ్డుమధ్యలో స్తంభం ఉండటం వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆ పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి, రోడ్డు పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

**వేద న్యూస్, రుద్రూర్:**



బాన్సువాడ పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం రుద్రూర్ మండల కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. 16వ, 17వ వార్డుల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు బిట్ల సురేందర్, అఫ్రోజ్‌లకు మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాయకులు ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో 16వ, 17వ వార్డుల్లో బరిలో ఉన్న బిట్ల సురేందర్, అఫ్రోజ్‌లను గెలిపించాలని రుద్రూర్ సొసైటీ మాజీ అధ్యక్షుడు పత్తిరాము కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో రుద్రూర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ నారోజి గంగారం, అక్కపల్లి నాగేందర్, సులేమాన్ నగర్ సర్పంచ్ ఖాదర్, ఉప సర్పంచ్ శాదుల్, సదర్ లతీఫ్, హాబీబ్, అఖిల్, దిశ సభ్యుడు అక్బర్‌నగర్ నగేష్, గోవింద్‌రావు పటేల్, యూత్ కాంగ్రెస్ నితిన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓరికే గంగారం, షేక్ సుభానీ, ఎండీ. జమీల్, ఖలీమ్, బొప్పాపూర్ సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ లింగం, కుర్మాజీ సాయిలు, స్వామి, రుద్రూర్ వార్డు మెంబర్ ఇమ్రాన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 06, 2026

# దీజననేస్తం సుంకరి రమేష్

- ప్రజలందరితో మమేకమై.. అందరి ఆశీస్సులు కోరుతూ..
- 17 వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి విస్తృత ప్రచారం
- చైర్మన్ పీఠం దిశగా..- సుంకరి రమేష్ వైపు ప్రజల మొగ్గు





**వేద న్యూస్, జమ్మికుంట:**

సౌమ్యుడు, వివాద రహితుడుగా పేరుగాంచిన సుంకరి రమేష్ కు హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోనీ ప్రజలు, వ్యాపారస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజానీకంతో విస్తృత సంబంధాలు ఉన్నాయి . జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీని ప్రజల్లో ఉంచేందుకు విశేష కృషి చేస్తూ.. ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే జమ్మికుంట 17వ వార్డు మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచి..ప్రచారంలో ప్రజల ఆశీస్సులు కోరుతూ ముందుకెళ్తున్నారు.సుంకరి రమేష్ కేవలం కౌన్సిలర్ పదవికే కాకుండా, భవిష్యత్తులో మున్సిపల్ చైర్మన్ పదవికి తగిన నాయకుడిగా ఉంటారని, సౌమ్యుడు, వివాద రహితుడుగా పేరుగాంచిన సుంకరి రమేష్ మున్సిపల్ చైర్మన్ గా సుపరిపాలన అందిస్తారని పలువురు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజా శ్రేయస్సుయే ధ్యేయం**

కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ.. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన నిబద్ధ కార్యకర్త సుంకరి రమేష్, ఏండ్లుగా పార్టీలో కొనసాగుతూ.. 2000 సంవత్సరం నుంచి హస్తం పార్టీలో కార్యకర్తగా మొదలై.. నాయకుడిగా పార్టీలో ఎదిగి.. పార్టీకి విశేష సేవలు అందిస్తున్నారు. జననేత, దివంగత సీఎం డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు శ్రేణుల్లో మనోధైర్యాన్ని నింపి.. పార్టీని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్ని స్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి హెదాలో ప్రస్తుత సీఎం రేవంత్రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ వరిధిలో చేపట్టిన పాదయాత్రలో కీలకంగా వ్యవహరించారు. సహజ వనరులు ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో కాంగ్రెస్ నాయకుడు రమేశ్ క్రియాశీలకంగా వ్యవహరించారు.

**శ్రేణులకు రమేశ్ ఆపన్న హస్తం**

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆపన్న హస్తం అందిస్తూ.. సొంత డబ్బులతో కార్యక్రమాలను నిర్వహించడం లోనూ వెనకాడ లేదు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్ ఛార్జీ ప్రణవ్ వొడితల ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యక్రమాలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. పార్టీలో విభేదా లకు తావు లేకుండా అందరినీ ఏకతాటిపైకి నడిపించేందుకు తన వంతుగా రమేశ్ కృషి చేస్తున్నారు.

**గెలుపు దిశగా..**

వార్డు స్థాయిలోనే కాకుండా, మున్సిపాలిటీ మొత్తాన్ని అభివృద్ధి చేసే దృష్టి ఉన్న నాయకుడగా ఆయనకు గుర్తింపు లభిస్తోంది. అందుకే ఈసారి 17వ వార్డు ప్రజలు ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి, కాంగ్రెస్ పార్టీ తరపున మున్సిపల్ కౌన్సిలర్గా మాత్రమే కాకుండా చైర్మన్ పదవికి కూడా అర్హుడిగా నిలబెట్టాలని సుంకరి రమేష్ అనుచర వర్గీయులు కోరుకుంటున్నారు.కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పారదర్శకత, ప్రజాస్వామ్యం, సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారు. అందుకే ఈసారి 17వ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరవేసి, సుంకరి రమేష్ను గెలిపించి మున్సిపాలిటీకి సమర్థవంతమైన చైర్మన్ను అందించాలనే సంకల్పంతో సుంకరి అనుచరులు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు.

# నియమావళి ప్రకారం విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల సిబ్బందికి వసతులు కల్పించాలి
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్లు, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా, నిజాయితీగా నిర్వహించాలని, ఎస్ఈసీ మార్గదర్శకాలు, హ్యాండ్‌బుక్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల సామగ్రితో కేటాయించిన వాహనాల్లోనే అధికారులు వెళ్లాలని, పోలింగ్ రోజున కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సరిచూసుకోవాలని ఆదేశించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం సామగ్రిని సిరిసిల్లలోని సినారే కళామందిర్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి అప్పగించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 32వ డివిజన్లో ట్రాక్టర్ అసోసియోషన్ నాయకులు ప్రచారం

**వేద న్యూస్, జ్యోతినగర్ :**

కాంగ్రెస్ పార్టీ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్ పాష,డివిజన్ ఇంచార్జీ పెండ్యాల మహేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 32వ డివిజన్ అభ్యర్థి పసుల రమాదేవి ప్రకాష్ కోసం ఎన్టీపీసీ ట్రాక్టర్ అసోసియోషన్ నాయకులు జోరుగా గురువారం ప్రచారం చేశారు.ఇంటిఇంటికి తిరుగుతు కర పత్రాలు అందజేస్తు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని అధిక మోజార్టీ తో గెలుపించాలని కోరారు.ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పసుల రమాదేవి ప్రకాష్ మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకుర్ ఆశ్శీస్సులతో ఎన్నికలో బరిలో 32వ డివిజన్ నుంచి పోటి చేస్తున్నట్లు తెలిపారు.డివిజన్ అభివృద్ది కోసం పని చేస్తానని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటానని పెర్కొన్నారు.ప్రతి ఒక్క ఓటర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని దీవించి అధిక మోజార్టీ తో గెలుపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియోషన్ నాయకులు గోడుగు శ్రీనివాస్,కుసుమ వేంకటేష్,సతీష్,తూల నాగరాజ్,



ఆముల శ్రీనివాస్,ఈదునూరి కుమార్,నర్సిమంహ,వేముల వేంకటేష్, తదితరులు ఉన్నారు.

# యూరియా లేక రైతులు ఇబ్బందులు

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో గురువారం వివిధ గ్రామాల రైతులు గోదాం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గోదాంలోకి కేవలం 200 యూరియా బస్తాలు మాత్రమే వస్తే అవి రైతులకు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. సాగు సీజన్‌లో యూరియా కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయాలని వారు కోరారు.



# ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) సందర్భంగా భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం పూలు, పండ్లతో స్వామి వారిని భక్తిశ్రద్ధలతో అలంకరించారు. ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి నామస్మరణతో భక్తుల భజనలు, శరణు ఘోషతో డీజిల్ కాలనీ దేవాలయం మారుమ్రోగింది. అనంతరం గుడిలో ఉన్న సమస్త దేవతలను భక్తులు దర్శించుకున్నారు. కుటీరం గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు రాజేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆశీర్వాదం అందరికీ ఎల్ల వేళలా ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు తంగేళ్లపల్లి శ్రీనివాస్, జరిపోతుల వెంకటేశ్వర్లు, గిరిమిట్ల రాజేష్, హేమంత్, కృష్ణ, దండిగం సతీష్ కుమార్, నడిచెట్టి కుమార్‌తో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# రూ.4 లక్షల నగదు సీజ్

## - చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడ్డ లెక్కలేని నగదు




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో తంగళ్ళపల్లి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. సిరిసిల్ల వైపు వెళున్న టీఎస్ 09 ఈఆర్ 7367 నంబర్ గల కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా, అందులో లెక్కలు చూపని రూ.4లక్షలు నగదు లభ్యమైంది. కారు డ్రైవర్, యజమాని పురుమడ్ల వెంకట్ రెడ్డి ఆ నగదుకు సంబంధించి ఎలాంటి ధృవీకరణ పత్రాలు చూపలేకపోయారు. దీంతో ఎస్ఎస్‌టీ బృంద ఇన్‌చార్జ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి నగదును సీజ్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కే. కృష్ణ తెలిపారు. ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరికి అందజేయడానికి తీసుకెళ్తున్నారు? అనే కోణంలో విచారణ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అనుమతి లేకుండా భారీ మొత్తంలో నగదును తరలించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న బిఆర్ఎస్ కార్యకర్త

**వేద న్యూస్, వేములవాడ :**



వేములవాడ పట్టణంలో బిఆర్ఎస్ ఇన్చార్జి నరసింహ రావు 28 వార్డ్ సీనియర్ నాయకులు పైడి శ్రీనివాస్ సతీమణికి బీఫామ్ ఇచ్చి పోటీలో నిలిపారు. అట్టి నమ్మకాన్ని పైడి స్వప్న వార్డులోని ఆర్యవైశ్యుల మద్దతు కూడగట్టుకుంటూ అన్ని కులాల మహిళా సంఘాల రాజన్న ఫ్రెండ్స్ యూత్ మద్దతు కూడగట్టుకుని వాడవాడలో తన వంతు సేవలు అందిస్తా అని చెబుతూ తనకున్న పరిచయంతో మీకు సేవ చేస్తాను అని హామీ ఇస్తూ ముందుకు వెళ్తుంది. వార్డులో ఉన్న శ్రేయోభిలాషులను మిత్రులను బి ఆర్ఎస్ నాయకులను అందరిని కలుపుకొని వార్డ్ ఇన్చార్జిలు బొజ్జమల్లేశం గొల్లపల్లి సర్పంచ్ మరియు సిద్ధంశెట్టి శ్రీనివాస్ అగ్రహారం టెంపుల్ మాజీ డైరెక్టర్ ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివ స్వాముల సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి రవీందర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మరిపెల్లి మల్లేశం ఆర్యవైశ్య సంఘం నాయకులను కలుపుకొని తాను ముందుకు పోతూ విజయపతాక ఎగరవేస్తాని హామీ ఇస్తూ నాకు కావలసిన పదవి మీకు కావలసిన అభివృద్ధి అంటూ ముందుకు పోతా ఉన్నది. ఎటువంటి లాభక్షణ లేకుండా పనిచేస్తానని చెప్పి హామీ ఇస్తూ ముందుకు ముందుకు వెళ్తున్నది వార్డు సభ్యులు ఆమె విజయానికి స్వఅభయమిస్తూ మాట ఇస్తున్నారు.

# సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామం నుంచి గుమ్లాపూర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అందరూ కలిసి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపల్లి సర్పంచ్ గంగాధర కావ్య లక్ష్మణ్, వార్డు సభ్యులు లాస్య రమేష్, మండల కాంగ్రెస్ కార్యదర్శి అల్వాల ధర్మయ్య, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి జాగిరి వెంకటేష్ గౌడ్‌తో పాటు వేణు కుమార్, మహేందర్, గంగాధర్, నరేష్, శ్రీకాంత్, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా నిర్వహించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 06, 2026

# 33వ డివిజన్ ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు

**వేద న్యూస్,జ్యోతినగర్ :**



రామగుండం కార్పోరేషన్ ఎన్నికల్లో 33వ డివిజన్ లోని ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మెరుగు భూలక్ష్మీ లింగ మూర్తి వైపు ప్రజలు మొగ్గు చూపుతు న్నారు.గురువారం ఆ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో మెరుగు లింగ మూర్తి అనేక సేవలు అందించారు.డివిజన్ అభివృద్ధి కోసం నిత్యం పాటు పడేవరని అన్నారు.డివిజన్ కార్పోరేట్ అయి అనేక సేవలు అందించాలని అనుకునేవాడని తెలిపారు .అనుకోకుండ ఇటివల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన కోరిక నేరవేరలని ఎన్నికలో బరిలో నిలుచున్నట్లు చెప్పారు.డివిజన్ ప్రజలకు సేవ చేసుకొనే భాగ్యం కల్గిందని అన్నారు.మెరుగు లింగమూర్తి కలను నేరవేర్చేందుకు కార్పోరేటర్ బరిలో ఉన్న నన్ను అత్యధిక మోజార్టీతో గెలుపించాలని కోరారు.స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకుర్ అండ దండలతో డివిజన్ అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తానాని అన్నారు.ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తాని ఆమె పెర్కొన్నారు.నాపై నమ్మకమంతో టికెట్ ఇచ్చిన ఎమ్మెల్యే మక్కాన్ రాజ్ ఠాకుర్ కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి నాయకులు విజయ్ గిరి రామ్,కుమ్మరి శ్రీను,కిషన్ రెడ్డి,పెగడపల్లి కిషోర్,మెరుగు నర్సయ్య,కంది అంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

# మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా చెట్లు

**- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు, ప్రయాణికులు**

**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న రహదారిపై ఇరువైపులా కాగితం పూల చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. చూడటానికి అందంగా కనిపిస్తున్నప్పటికీ, ఈ చెట్లు మూలమలుపుల వద్ద ఎదురు నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా అడ్డుగా నిలుస్తున్నాయని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వారు తెలిపారు. ఈ రహదారి మీదుగా చందుర్తి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు నిత్యం అనేక మంది ప్రయాణికులు ప్రయాణాలు చేస్తుంటారు. రోడ్లకు ఇరువైపులా



పెరిగిన ముళ్ల పొదలు, చెట్లను తొలగించి రహదారి భద్రతను మెరుగుపర్చాలని వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

**- ఉత్తమ విద్యా సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఉత్తమ విద్యా సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు సూచించారు. పరీక్షలను భయంతో కాకుండా సాధారణ దశగా భావించాలని, చదివిన అంశాల పునశ్చరణపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి ఏకాగ్రతతో చదవాలని సూచించారు. పరీక్ష రోజున ప్రశాంతంగా ఉండి ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివిన తరువాతే సమాధానాలు రాయాలని చెప్పారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చి అనవసరమైన ఒత్తిడిని పెంచకూడదని పేర్కొన్నారు. మార్కులకన్నా పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తే ముఖ్యమని గుర్తించి, పరీక్షల ఫలితాలే జీవితానికి తుది గమ్యం కాదని పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలని ఆయన కోరారు.

# అమ్మో.. కుక్కలు!

- కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు
- భయంతో వణుకిపోతున్న ప్రయాణికులు
- రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణం
- అధికారులు పట్టించుకోవాలని ప్రయాణికుల వేడుకోలు



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రి వేళ ప్రయాణికులు కుక్కల భయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి పడితే చాలు బస్టాండ్ పరిసరాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ, రాత్రిపూట బస్సుల నుంచి దిగే ప్రయాణికులపై దాడికి దిగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో జనసంచారం తక్కువగా ఉండటంతో పదుల సంఖ్యలో కుక్కలు గుంపుగా అరుస్తూ, ఎగబడుతూ బెదిరించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కొన్నిసార్లు ప్రాణభయంతో "కుక్కలు బాబోయ్..! కుక్కలు!" అంటూ పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యకు ప్రధాన కారణం బస్టాండ్‌కు సమీపంలోని వాగు ఒడ్డున చెత్తాచెదారం, వ్యర్థ ఆహార పదార్థాలను డంపు చేయడమేనని స్థానికులు చెబుతున్నారు. వాటి కోసం కుక్కలు బస్టాండ్ పరిసరాల్లో తిష్ట వేసి, రాత్రిపూట ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఒంటరిగా లేదా ఇద్దరు మాత్రమే రాత్రి వేళ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడిలో ఎలాంటి అనుకోని ఘటనలు జరిగితే బాధ్యత ఎవరిది? అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కుక్కల దాడుల్లో చిన్నారులు మృతి చెందిన ఘటనలు, పలువురు గాయపడుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నామని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రిపూట బస్టాండ్‌లో కుక్కల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త డంపింగ్‌ను నియంత్రించి ప్రయాణికులకు భద్రత కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

# గ్రామం నడిబొడ్డున వైన్స్ షాప్

- మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు
- అటుగా వెళ్లలేకపోతున్న విద్యార్థినులు, మహిళలు
- సమస్యకు పరిష్కారం చూపాలంటున్న స్థానికులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో గ్రామం నడిబొడ్డున ఉన్న వైన్స్ సెంటర్ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తీవ్ర ఇబ్బందులకు కారణంగా మారుతోంది. ఊరి మధ్యలోనే వైన్స్ షాప్ ఉండటంతో మహిళలు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులు, కాలేజీకి వెళ్లే యువతులు, చిన్నపిల్లలు ఉదయం నుంచి రాత్రి వరకు రాకపోకల్లో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వైన్స్ సెంటర్ సమీపంలోనే పాఠశాలలు, దేవాలయాలు ఉండటంతో విద్యార్థులు రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం స్కూల్ సమయాల్లో, సాయంత్రం కాలేజీ ముగిసే వేళ మద్యం సేవించిన వారి అరుపులు, అసభ్య ప్రవర్తన కారణంగా విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై, మెయిన్ సెంటర్‌లో ఈ వైన్స్ సెంటర్ ఉండటంతో వందలాది మంది రోజూ ఆ మార్గం గుండా వెళ్లాల్సి వస్తోంది. ఉదయం 6 గంటల నుంచే సిట్టింగ్ రూమ్ ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తెల్లవారుజామునే మద్యం కోసం గుంపులుగా చేరడంతో రహదారి మొత్తం గందరగోళంగా మారుతోందని గ్రామస్తులు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు రోడ్డుపై గొడవలకు




దిగడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, మహిళల భద్రతపై ఆందోళన నెలకొందని వారు పేర్కొన్నారు. దీంతో చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ సమస్యపై మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధి గురించి మాట్లాడుతున్న తరుణంలో ఇలాంటి వైన్స్ సెంటర్ గ్రామ నడిబొడ్డున ఉండటం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఇది గ్రామ ప్రశాంతతకు భంగం కలిగించడమే కాక మహిళల భద్రతకు పెద్ద ముప్పుగా మారిందని వాపోతున్నారు. అందుకే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వైన్స్ సెంటర్‌ను గ్రామం నుంచి తొలగించి, ఊరి బయట ప్రాంతానికి మార్చాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

# ప్రభుత్వ సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ప్రకటన

**వేద న్యూస్, హైదరాబాద్:**

2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో గణితశాస్త్ర పీజీ విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు అర్హతల ధ్రువీకరణ పత్రాలను నేడు ఉదయం 11 గంటలకు కళాశాలలోని గణితశాస్త్ర విభాగాధిపతిని కలవాలని సూచించారు. ఈ మేరకు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. ప్రసాద్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అలాగే పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలు కలిగి, బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన వెల్లడించారు.

# పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

- అధికారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్ల ఇబ్బంది ఉండొద్దు
- దివ్యాంగులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



ఈ నెల 11న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంపులు, పోలింగ్ అధికారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో కుసుమ రామయ్య హై స్కూల్‌లో జరుగుతున్న తరగతులను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, విద్యార్థులకు పరీక్షలపై సూచనలు చేశారు. టైమ్‌టేబుల్ ప్రకారం చదవాలని, అన్ని సబ్జెక్టులకు ప్రణాళిక సిద్ధం చేసుకుని క్రమం తప్పకుండా అధ్యయనం చేయాలని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు సాధన చేయాలని, రోజూ సెల్ఫ్ స్టడీకి 3, 4 గంటలు కేటాయించాలని తెలిపారు. మార్చి 10లోపు అన్ని సబ్జెక్టుల రివిజన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలకు పాల్పడిన ఏడుగురు అరెస్ట్




**- 15 తులాల బంగారం, 32 తులాల వెండి స్వాధీనం**

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 15 తులాల బంగారం, 32 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జనవరి 20, 25 తేదీల్లో మెట్‌పల్లి పట్టణంలో మహిళలపై దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, మెట్‌పల్లి బస్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. విచారణలో దొంగిలించిన బంగారంలో కొంత భాగాన్ని స్థానిక బంగారు వ్యాపారికి విక్రయించినట్లు తేలిందన్నారు. సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ ఆధారాలతో కేసును ఛేదించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ఈఎల్స్ ఇవ్వాలి

**వేద న్యూస్, హైదరాబాద్ ఎడ్యుకేషన్:**

2024 దేశవ్యాప్తంగా నిర్మించిన పార్లమెంటు ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న అధికారులు అధ్యాపకులు సిబ్బంది ఎలక్షన్ సంబంధించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించి పార్లమెంట్ ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించారని దీనికి సంబంధించిన ఈఎల్స్ ఇప్పటివరకు ఇవ్వనందున తక్షణమే వాటిని మంజూరు చేయవలసిందిగా బుధవారం ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య కు ఆన్లైన్లో వినతి పత్రం పంపించినట్టు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ లు తెలిపారు. ఈ విషయంలో గతంలో కూడా వినతిపత్రం ఇవ్వగా ఇంటర్ విద్యా డైరెక్టర్ త్వరలోనే వీటికి సంబంధించిన ప్రొసీడింగును విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు మంజూరు కానందున వెంటనే సాంక్షన్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేయటం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ ఇంటర్ విద్య రీజనల్ డైరెక్టర్ వరంగల్ కు కూడా వినతిపత్రం పంపించినట్లు తెలియజేశారు.

## 21 కిలోమీటర్లు.. 1 గంట 38 నిమిషాల్లో పూర్తి

- మారథాన్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ
- కానిస్టేబుల్ బండ అనిల్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ




**వేద న్యూస్, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ బండ అనిల్ వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన మారథాన్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన మారథాన్ లో 21 కిలోమీటర్లు 1 గంట 38 నిమిషాల్లో పూర్తి చేయగా, ఆయనను జిల్లా ఎస్పీ బి. మహేష్ గీతే అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీల్లో పాల్గొని రాష్ట్ర, దేశ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే యువ పోలీస్ సిబ్బందికి బండ అనిల్ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కానిస్టేబుల్ బండ అనిల్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వయసుతో సంబంధం లేకుండా రన్నింగ్ వంటి వ్యాయామాలు చేయాలని సూచించారు. దీని వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ వుతుందని, ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంతకుముందు ముంబై మారథాన్‌లో 42.2 కిలోమీటర్లు 3 గంటలు 26 నిమిషాల్లో, రాజస్థాన్‌లోని ఇండియా బోర్డర్ ప్రాంతంలో తీవ్రమైన చలిలో 100 కిలోమీటర్లు 14 గంటల్లో, కోల్‌కతాలో జరిగిన మారథాన్‌లో 25 కిలోమీటర్లు 1 గంట 56 నిమిషాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు.

## మేడారం హుండీ లెక్కింపు ప్రక్రియను ప్రారంభించిన మంత్రి



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

హనుమకొండ టిటిడి కల్యాణ మండపంలో మేడారం సమ్మక్కసారక్క వనదేవతల హుండీ లెక్కింపు ప్రక్రియను మంత్రి కొండా సురేఖ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి సురేఖ మాట్లాడుతూ, మేడారం జాతరకు దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను పూర్తిస్థాయి భద్రతా చర్యలు, పారదర్శక విధానాలతో లెక్కించేందు కు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి ఎలాంటి లోటు లేకుండా, ప్రతి రూపాయి జాగ్రత్తగా లెక్కించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. మేడారం సమ్మక్కసారక్క వనదేవతల ఆశీస్సులతో జాతరను విజయవంతంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఇంటింటి ప్రచారం



**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగం గా మిర్యాలగూడ పట్టణంలోని 6వ వార్డులో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, బడుగు బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు సంక్షేమ పథకాల అమలు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకల వేణుగోపాల్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోరుగా బీజేపీ ఇంటింటి ప్రచారం



**వేద న్యూస్, రుద్రూర్:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాన్సు వాడ పట్టణంలోని 15వ వార్డు బీజేపీ అభ్యర్థి గుడుగుట్ల సారిక అనిల్‌కు మద్దతుగా గురువారం రుద్రూర్ మండల బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరు ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటర్లలో బీజేపీకి బలమైన మద్దతు ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. 15వ వార్డు అభ్యర్థి గుడుగుట్ల సారిక అనిల్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బాన్సువాడ మున్సిపల్ ఎలక్షన్ ఇన్‌చార్జ్ ఇంద్రసేనారెడ్డి, జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సున్నం సాయిలు, తృప్తి శివ ప్రసాద్, కోటగిరి మండల అధ్యక్షుడు వేముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, అంబం సర్పంచ్ గంగాధర్, గణేష్, వడ్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు




**వేద న్యూస్, కరీంనగర్:**

శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం రోజున యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ లా కళాశాల సెమినార్ హల్ లో "భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు యొక్క ప్రభావం "అనే అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సదస్సు ముగిసింది. రెండవ రోజు సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్. ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఉపకులపతి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, నల్గొండ మాట్లాడుతూ అన్ని రంగాల్లో కృత్రిమ మేధస్సును విరివిగా ఉపయోగించిడం వలన భారత ఆర్థిక వ్యవస్థను కృత్రిమ మేధస్సు ప్రభావితం చేస్తుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్య, పర్యాటక మరియు అన్ని రంగాలలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడం వలన ఉత్పత్తిని పెరిగి ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు పెరుగుదల గణనీయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ. సతీష్ కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఇంజనీరింగ్, నానో రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి అని పేర్కొన్నారు. మరొక అతిథి ప్రొ. సురేష్ లాల్, డైరెక్టర్ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కాకతీయ విశ్వవిద్యాలయం మాట్లాడుతూ ముఖ్యంగా భారత వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సును విరివిరీగా ఉపయోగించి వలసిన అవసరం ఉందన్నారు. పరిశోధనా రంగంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఎన్నో ఫలితాలు సాధించ వచ్చు అని డాక్టర్. మహ్మద్ జాఫర్ జరి పేర్కొన్నారు. సెమినార్ కన్వీనర్ అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కె. శ్రీవాణి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు- భారత ఆర్థిక వ్యవస్థ పై దాని ప్రభావం అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు దాదాపు 60 పరిశోధన పత్రాలను సమర్పించారని, వాటిలో ముఖ్యమైన పరిశోధన పత్రాలను జర్నల్స్ రూపంలో ముద్రించి విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాల ఆర్ట్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. పద్మావతి, ప్రొ. ఏం. వరప్రసాద్, ప్రొ.సూరేపల్లి సుజాత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. మహ్మద్ అబ్రహర్ బాకీ, డాక్టర్ .డి హరి కాంత్ డాక్టర్. ఉమేరా తస్లీమ్, డాక్టర్. మునావర్, డాక్టర్ విజయ్ ప్రకాష్, డాక్టర్. డి.సత్యనారాయణ, డాక్టర్. విద్యా సాగర్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. .

# విద్యారంగానికి అందని ద్రాక్షలా కేంద్ర బడ్జెట్

- కార్పొరేటీకరణే లక్ష్యంగా కుట్రలు
- ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు ధ్వజం



**వేద న్యూస్,నల్లబెల్లి :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించిందని, పేద విద్యార్థులకు విద్యను అందని ద్రాక్ష గా మార్చేలా ఉందని ఏఐఎఫ్‌డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు విమర్శించారు. గురువారం నల్లబెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు జరిగిన అన్యాయాన్ని ఆయన ఎండగట్టారు. మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 2.6 శాతం 1,39,289 కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యా రంగానికి జీడీపీలో 6 శాతం ఖర్చు చేయాలన్న కనీస నిబంధనను కేంద్రం తుంగలో తొక్కిందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసి, విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్ శక్తులకు ధారాదత్తం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం ( ఎన్ ఈ పి-2020) అమలు చేస్తామని గొప్పలు చెబుతున్న బీజేపీ ప్రభుత్వం, దానికి అవసరమైన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతు న్నాయి, మరోవైపు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అల్లాడుతుంటే, కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దేశంలో నిరుద్యోగ రక్కసి కోరలు చాస్తున్నా, యువతకు ఉపాధి కల్పించే దిశగా బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత లేదని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా రంగానికి నిధులు పెంచాలని, లేనిపక్షంలో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ గర్ల్స్ కన్వీనర్ గణిపాక బిందు, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై గుంతలకు మరమ్మతులు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో తారు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. రాగట్లపల్లి కమాన్ నుంచి నారాయణపూర్ వరకు రూ.1 లక్ష 83 వేల వ్యయంతో మంజూరైన పనులు ప్రారంభించామని తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం రూ.55 లక్షల 40 వేలతో తారు రోడ్ల మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఎల్లారెడ్డిపేట నుంచి బండలింగంపల్లి వరకు, పోతిరెడ్డిపల్లి నుంచి ధర్మారం వరకు, అక్కపల్లి నుంచి శివంగాలపల్లి వరకు ఈ పనులు కొనసాగుతాయని వెల్లడించారు. అదేవిధంగా మండల పరిధిలోని పధిర దుమాల కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు కూడా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు మాదాసు బాబు, శ్రీకాంత్ రెడ్డి, మెండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వారాంతపు సంత ప్రారంభించిన సర్పంచ్



**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామంలో ప్రతి గురువారం వారాంతపు సంతతో పాటు మేకల సంతను ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చీకోడు గ్రామంలో నిర్వహించే వారాంతపు సంతకు చుట్టుపక్కల గ్రామాల రైతులు, చిరు వ్యాపారులు వచ్చి తమ కూరగాయలను నేరుగా విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. అలాగే వచ్చే వారం నుంచి మేకల సంతను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. మేకలు, గొర్రెలు విక్రయించేవారు దళారుల జోక్యం లేకుండా నేరుగా గ్రామ సంతలో విక్రయించుకొని ప్రయోజనం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆస రంజిత్, వార్డు సభ్యులు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే..: ఎస్ఐ



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మూడపెల్లి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు ద్విచక్ర వాహనాల తనిఖీలను ఎస్ఐ జిల్లెళ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం నిషిద్ధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి అవసరమైతే జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఓవర్ స్పీడ్ కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాహనదారులు నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

- వేములవాడ బార్ అసోసియేషన్
- మహిళా న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ



**వేద న్యూస్, వేములవాడ:**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాది స్వప్నను ఆమె సోదరుడే హత్య చేయడం దారుణమని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం అన్నారు. ఈ హత్యకు నిరసనగా గురువారం కోర్టు ప్రధాన ద్వారం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు విధుల బహిష్కరణతో పాటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. న్యాయవాదిగా ఎదుగుతున్న దశలో ఇలాంటి ఘోర ఘటన జరగడం బాధాకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, వారి తరఫున ఎలాంటి న్యాయవాది వకాలత్ చేయవద్దని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, మహిళా ప్రతినిధి జక్కుల పద్మతో పాటు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# పేదలకు భరోసా ఉపాధి హామీ పథకం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పతికుంటపల్లి గ్రామంలో గురువారం గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ జుట్టు శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పలత పరిశీలించారు. పనుల కొలతల్లో ఎటువంటి తప్పులు జరగకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పేదలకు ఒక భరోసా అని, ప్రతి అర్హుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, కచ్చితంగా నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులు కూలీలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపడుతున్న పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ ప్రజావ్యతిరేకం

- పేదలకు నష్టం..
  కార్పొరేట్లకు మేలు
- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ



**వేద న్యూస్, కారేపల్లి:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేకమని, ఇది దేశాన్ని ఆర్థిక బానిసత్వం వైపు నడిపిస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా నేత భూక్య శివా నాయక్ తీవ్రంగా విమర్శించారు. పేదలపై కోతలు విధిస్తూ కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడం బీజేపీ విధానమని ఆయన ఆరోపించారు. వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించడం వల్ల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. గ్రామీణ పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, విదేశీ పెట్టుబడుల పేరిట సామ్రాజ్యవాద శక్తులకు ప్రభుత్వం దళారీగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. 2047 నాటికి దేశాన్ని అగ్రరాజ్యంగా మారుస్తామన్న హామీలు వట్టి మాటలేనని వ్యాఖ్యానించారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అక్రమ నగదు, మద్యం రవాణాను కట్టడి చేయాలి

- చెక్‌పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గురువారం పట్టణ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. వాహన తనిఖీల రిజిస్టర్లను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు నమోదు చేయాలని, ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా జరిగే నగదు, మద్యం వంటి అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని సూచించారు. మున్సిపల్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై 6 కేసులు నమోదు చేశామని, తనిఖీల్లో రూ.26,70వేలు నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే 10 కేసుల్లో 85.695 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు 80 కేసుల్లో 127 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలో పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో కోతుల రాజ్యం



- ఇళ్లల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్న వానరాలు
- భయాందోళనకు గురవుతున్న గ్రామస్తులు
- వీర్నపల్లిలో విఫలమైన యంత్రాంగం

**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గ్రామాల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి సరుకులు ఎత్తుకుపోవడం నిత్యకృత్యంగా మారింది. దీంతో ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లలోకి దూసుకువచ్చే కోతుల కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. పలువురు గాయాలపాలైన ఘటనలు జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం ప్రజల సహనానికి పరీక్షగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య బాధ్యతల నెట్టివేతతో సమస్య మరింత ముదిరిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులు, వినతిపత్రాలు కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలు, జీవనాధారాలు ప్రమాదంలో ఉన్నా అధికార యంత్రాంగం మౌనంగా ఉండడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను విస్మరిస్తే ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని, దాని పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# సీఎం తీరు హుందాగా లేదు..




- వెంటనే క్షమాపణ చెప్పాలి
- ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన బుద్ధి చెప్పాలి
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ఆగ్రహం

**వేద న్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పై సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడాన్ని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. గురువారం మిర్యాలగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హుందాతనం కోల్పోయి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే కానీ, సీనియర్ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం అహంకారానికి నిదర్శనమన్నారు. భాస్కర్ రావు చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వాడే భాష ప్రజాస్వామ్యానికి హానికరమని, వెంటనే భాస్కర్ రావుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. నిన్న జరిగిన సభలో ముఖ్యమంత్రి తన హోదాను మరిచి తెలంగాణ ప్రదాత కేసీఆర్ పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన త్యాగాలను విస్మరించి విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. వ్యక్తిగత కక్ష సాధింపులకంటే రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకు లు అన్నభిమోజు నాగార్జున చారి, సిద్ధార్థ, నారాయణ రెడ్డి, వీరకోటి రెడ్డి, సంపత్, కట్టా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 48 గంటల నిబంధన తప్పకుండా పాటించాలి



**వేద న్యూస్, మంచిర్యాల:**

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 11న పోలింగ్ జరగనున్నందున, పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 48 గంటల నిబంధనను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసే 48 గంటల ముందు అన్ని రకాల ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. అలాగే మీడియా, ప్రసార సాధనాల ద్వారా కూడా ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు కొనసాగించ రాదన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్-2019లోని సెక్షన్ 209 ప్రకారం శిక్ష విధించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు. స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా యాజమాన్యాలు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

# నిరుపయోగంగా మారిన బస్టాండ్లు

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు





**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మరిగడ్డ, ముడపల్లి గ్రామాల బస్టాండ్లు నిరుపయోగంగా మారాయని రెండు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే బస్టాండ్లు ఉన్నాయే తప్ప, వాస్తవంగా ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్నాయని వారు వాపోతున్నారు. బస్టాండ్ల ముందు భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి బస్టాండ్ ఉన్నదే గుర్తించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. రాత్రి వేళల్లో బస్టాండ్లు పూర్తిగా అంధకారంలో మునిగి పోతున్నాయని, సరైన వెలుతురు సౌకర్యం కూడా లేదని అన్నారు. బస్టాండ్ ప్రాంగణం దుమ్ము, ధూళితో అధ్వాన్న స్థితికి చేరుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు ఎండ, వానలకూ తట్టుకుంటూ రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్లను శుభ్రపరచి, ప్రయాణికులకు ఉపయోగపడేలా మౌలిక వసతులు కల్పించాలని ఇరు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగుపరచాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జనరల్ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ప్రజ్ఞ మీటింగ్ హాల్‌లో ఆసుపత్రి పని తీరు, పెండింగ్ అభివృద్ధి పనులపై వైద్య అధికారులు, మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పని తీరులో మార్పు రాకపోతే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి నెలాఖరులోగా సీవరేజ్, టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, మార్చి 15 నాటికి ఎస్‌టీపీ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఓపీ సేవలు మెరుగుపర్చేందుకు ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తాత్కాలికంగా నియమించాలని, 7 రోజులలో లిఫ్ట్ మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో సిబ్బంది హాజరు నమోదు చేసి, అదే ఆధారంగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. అత్యవసర వైద్య పరికరాల కొనుగోలు వెంటనే చేపట్టాలని, ఎమర్జెన్సీ అవసరాల కోసం నిధులు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి భద్రత దృష్ట్యా ఫైర్ సేఫ్టీ, సీసీ కెమెరాల ఏర్పాటు మార్చి 15 నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వివిధ విభాగాల వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 06, 2026

# మంచి నీటి పంపు మరమ్మతులు పూర్తి

- గ్రామ ప్రజలకు ఉపశమనం

**వేద న్యూస్, కాసిపేట:**

కోమటిచేను గ్రామ పంచాయతీలోని రెండో వార్డులో గత కొన్నేళ్లుగా పనిచేయని మంచి నీటి పంపును మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందుల నుంచి స్థానిక ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ జాడీ మాణిక్య, గ్రామ పెద్ద శంకరయ్య ఆధ్వర్యంలో పంపుకు అవసరమైన మరమ్మతులు చేపట్టించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలో ఎవరూ తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకూడదని, ప్రతి వార్డులో నీటి సౌకర్యం మెరుగుపర్చడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొడప అనంతరావు, నాయకులు మాసు సుధాకర్, బానయ్య తదితరులు పాల్గొన్నారు. పంపు మరమ్మతులకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ టోనీ

- ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం

**వేద న్యూస్, కారేపల్లి:**



పదవి అనేది అధికారం కోసం కాదు.. ప్రజల సేవ కోసం అనే భావనతో పనిచేస్తున్న సింగరేణి గ్రామ పంచాయతీ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ప్రజల మన్ననలు పొందుతున్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం (కారేపల్లి సంత)కు వచ్చే భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఆలయ కమిటీ అభ్యర్థనపై సర్పంచ్ వెంటనే స్పందించి ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. మాటలకే పరిమితం కాకుండా పనిలో చూపిన ఈ చొరవ భక్తులు, గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది. భక్తుల సౌకర్యం కోసం స్పందించిన సర్పంచ్‌కు దేవస్థానం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధిలో నిబద్ధతతో పనిచేస్తూ, నాయకుడిగా కాక ప్రజా సేవకుడిగా గుర్తింపు తెచ్చుకుంటున్నారని స్థానికులు కొనియాడుతున్నారు.

# విజయం నీదే..



- భరోసానిస్తున్న ఓటర్లు
- గడపగడపకు తిరిగి ప్రచారం చేస్తున్న పొనగంటి రాము
- 9వ వార్డు బీఆర్ ఎస్ కౌన్సిలర్ అభ్యర్థికి అపూర్వ ఆదరణ
- ప్రచార పర్వంలో ముందు వరుసలో గులాబీ దళం

**వేద న్యూస్ , జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డు లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పొన్నగంటి రాము విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనకు జనం మద్దతు తెలుపుతూ.. ఆశీస్సులు అందజేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. కౌన్సిలర్ అభ్యర్థి రాము.. 9వ వార్డు ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ.. ప్రచారంలో ముందంజలో ఉన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంటింటికి వెళ్లిన అభ్యర్థి రామును ఓటర్లు అక్కున చేర్చుకుంటున్నారు. విజయం నీదే అంటూ భరోసానిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో బలంగా..**

వార్డు పరిధిలోని ప్రజానీకంతో మమేకమవుతూ.. క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రాము బలంగా దూసుకెళ్తున్నారు. ప్రజాక్షేమమే ధ్యేయంగా ఎన్నికల బరిలో నిలిచిన తనను నిండు మనసుతో ఆశీర్వదించి కౌన్సిలర్ గా గెలిపించాలని రెండు చేతులు జోడించి ఓటరు మహాశయులను ప్రార్థిస్తున్నారు. తాను వార్డు ప్రజలందరికీ పిలుపు దూరంలోనే అందుబాటులో ఉంటా నని, జనక్షేమమే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేస్తానని వెల్లడి స్తున్నారు. వార్డును అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలపడమే కాకుండా.. వార్డు ప్రజలకు కష్ట సుఖాలలో అండగా నిలిచే కుటుంబ సభ్యుని వలె ఉంటానని హామీనిస్తున్నారు. తాను ప్రజల్లో ఉండేందుకే కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని, తనను ఆదరించి ఆశీర్వదిస్తే.. తప్పకుండా అందరికీ శక్తివంచన లేకుండా ప్రజా ప్రతినిధిగా సేవలందించేందుకు 24/7 పూర్తి సమయం కేటాయి స్తానని స్పష్టంగా హామీ ఇస్తున్నారు. కాగా, బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రాము ప్రచారానికి ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభిస్తున్నదని, ఆయన గెలుపు తథ్యమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వరరావు పేటలో కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరరావు పేటకు చెందిన సబ్బని గణేష్ (36) అడవి పందుల బెడద నుంచి పొలాన్ని కాపాడుకునేందుకు అక్కవత్తుల వినోద్, కోట సురేష్‌లతో కలిసి విద్యుత్ వైర్లు ఏర్పాటు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన గణేష్‌ను చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సబ్బని లహరి ఫిర్యాదు మేరకు వినోద్, సురేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

# సిరిసిల్లలో పోలీసుల నిఘా

- బెల్ట్ షాపుపై దాడి
- భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల పట్టణంలో పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గణేష్‌నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై పట్టణ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ కే. కృష్ణ తన సిబ్బందితో కలిసి ఆసరి ముత్యం (58) నివాసంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో రూ.31,482 విలువైన 28.62 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలు కాపాడేందుకు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పులి మణి ముదిరాజ్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన మెపా

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



జాతి బిడ్డలకు మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) అండగా ఉంటుందని వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన మెపా రాష్ట్ర గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్ సతీమణి మణి ముదిరాజ్ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పులి ప్రభాకర్ ముదిరాజ్ ను పరామర్శించి, మణి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ జాతి బిడ్డలు ఏ స్థానాల్లో ఉన్న , కష్టాల్లో ఆదుకుని, అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఎవరికి ఆపద వచ్చిన మెపా ముందుంటుందని ఈ సందర్భంగా గతంలో చేసిన కార్య క్రమాలను గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షు లు పులి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు, వ్యవ స్థాపక సభ్యులు బోనాల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్టపల్లి రజనీకాంత్, మట్టపల్లి సాంబయ్య, జక్కుల సమ్మయ్య, విజయ్ కుమార్, మహేష్, ఆళ్ల నరేష్, కాపరబోయిన వేణుగోపాల్, బొల్లి భాను ప్రకాష్ , సాయి లతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు
# తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**వేద న్యూస్ హైదరాబాద్ :**




డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఆన్లైన్‌లో అరెస్ట్ చేసినట్టు బెదిరిస్తూ, వీడియో కాల్ ద్వారా పోలీసులుగా నటించి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు అక్రమ లావాదేవీలు, డ్రగ్స్ కేసులు, పార్సెల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయంటూ భయపెట్టి వీడియో కాల్ చేస్తారని పోలీసులు పేర్కొన్నారు. ఆధార్, పాన్ కార్డు వివరాలు అడగడం, నగదు బదిలీ చేయాలని ఒత్తిడి చేయడం వంటి పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ అనేది అసలు చట్టపరమైన ప్రక్రియ కాదని, పోలీసులు ఎప్పటికీ ఫోన్ కాల్ లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలాంటి కాల్స్ వస్తే భయపడవద్దని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంక్ సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాలపై హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు ప్రజలను కోరారు. అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.

# అందరినీ కలుస్తూ.. ఆత్మీయంగా ఓట్లు అభ్యర్థిస్తూ..



- 20వ వార్డులో కొక్కుల శ్రీలత కేదారేశ్వర్ ఇంటింటి ప్రచారం
- ప్రజల ఆశీస్సులు కోరుతూ బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత క్యాంపెయిన్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో బీ ఆర్ ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కొక్కుల శ్రీలత కేదారేశ్వర్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. 20వ వార్డు పరిధిలోని ప్రజలందరినీ కలుస్తూ ఆత్మీయంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తమను ఆదరించి ఆశీర్వదించాలని కోరుతున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తాము పనిచేస్తామని, కౌన్సిలర్ గా గెలిపిం చాలని ఓటర్లను అడుగుతున్నారు.

**ప్రజాసేవ యే లక్ష్యం**

ప్రజాసేవయే లక్ష్యంగా ముందుకొచ్చిన తమను ఆదరించి ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కౌన్సిలర్ అభ్యర్థి శ్రీలత కేదారేశ్వర్ కోరుతున్నారు. కౌన్సిలర్ అభ్యర్థి శ్రీలత తరఫున బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు శ్రేణులు గురువారం వార్డు పరిధిలో విస్తృతంగా ప్రచారం చేశారు. గులాబీ జెండా రెపరెపలాడే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని, 20వ వార్డు పరిధిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు ధీ మా వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి.. ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండే నాయకులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని బీఆర్ఎస్ నేతలు జనాన్ని కోరారు. ప్రచారంలో బి ఆర్ ఎస్ మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073